www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 5 అక్టోబర్ 2024

5

తిరుపతి

పీజీ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2024 సంవత్సరానికి గాను వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సు చేరడానికి నిర్వహించిన ఏపీ పీజీ సెట్-2024లో ర్యాంకులు పొంది ఎస్వీయూలో ఫేస్-2 పీజీ సెట్‌లో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, ఏపీ ఐసెట్-2024 ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ఖాళీపై అయిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్ కోసం ఈనెల 7వ తేదీన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి రావాలని డిఓఏ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబు వెల్లడించారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లను పరిశీలించి ఆరోజే ఫీజు చెల్లించుకుంటారని తెలిపారు. ఎస్వీయూ పీజీ సెట్‌లో సీట్లు పొందిన విద్యార్థులందరూ ఆఖరి తేదీన స్టేట్ బ్యాంక్ మిద్దె పైన ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి

శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇసుక ధరలు భగ్గు మంటున్నాయని, సామాన్యులకు ఇసుక దొరకడం గగనమైందని సిపిఎం నాయకులు అన్నారు. ఇసుక ధరలకు కళ్లెం వేసి లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న ఇసుక విధానంకు వ్యతిరేకంగా శుక్రవారం సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. పేరుకే ఇసుక ఉచితమంటున్నారే కానీ, కొందరు అక్రమార్కుల చేతుల్లో అది వ్యాపారంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వాపోయారు. గత ప్రభుత్వంలోలాగే ట్రక్కు ఇసుక రూ.3వేల పైబడు ధర పలుకుతోందని విచారం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో ఇసుక రీచ్ లేని కారణంగా అక్రమార్కులు వారి ఇష్టానుసారం రేట్లు పెంచి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. నిఘా వ్యవస్థ నిర్వీర్యపోతుండడంతో ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి సామాన్యులకు ఇసుక ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, కుమార్, గురవయ్య, రాఘవ సుబ్రమణ్యం, బాలకృష్ణ, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని శుక్రవారం తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పి.చిన్న అధ్యక్షత ధర్నా చేశారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఇసుక విధానం కేవలం పేపర్లకే ఆచరణలో మాత్రం గతం కన్నా ఏమీ గొప్పగా లేదన్నారు. తక్షణమే ఇసుకను ఉచితంగా ప్రజలందరికీ అందివ్వాలని నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎండి.శ్రీనివాసులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తిరుపతిలో..

పుత్తూరు టౌన్: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత ఇసుక అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. నగరి నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకుని రావాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివకుమార్, మోహన్, భవన నిర్మాణ నాయకులు శేఖర్, సర్వన్, నవీన్ కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: తెలుగుదేశం పార్టీ ఉచిత ఇసుక విధానాన్ని తెస్తామని హామీ ఇచ్చి నేటికీ నాలుగు నెలలు గడుస్తున్నా కూడా ఉచిత ఇసుకను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ విమర్శించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. మండల నాయకులు ధనంజయులు, రమణయ్య, బాలగురవయ్య, జెకె రమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

నారాయణవనం: ఉచిత ఇసుక అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి మునిశంకర్ డిమాండ్ చేస్తూ తుంబూరు కాజ్వే వద్ద ధర్నా చేశారు. నాయకులు నాగరాజు, మునేంద్ర, చిట్టిబాబు, దొరవేలు, గంగయ్య, మునెమ్మ, జ్యోతి, అమ్ములు పాల్గొన్నారు.

గూడూరులో..

బుచ్చినాయుడు కండ్రిగలో..

నారాయణవనంలో..

గూడూరు టౌన్ : గూడూరు పరిసర ప్రాంతాల్లో ఉన్నా రీచ్, వాకాడు, చిట్టమూరు, గూడలి రీచ్‌ల ద్వారా ఉచిత ఇసుకకు అనుమతి ఇవ్వాలని గూడూరు సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. భవన నిర్మాణ సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, సురేష్, బివి.రమణయ్య, గుర్రం రమణయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి బోర్డు ఛైర్మన్‌గా పొన్నారావు..?

త్వరలోనే అధికారిక ప్రకటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీకాళహస్తి ఆలయ ధర్మకర్తల పాలకమండలి అధ్యక్షులుగా ఏర్పేడు మండలం, జంగాలపల్లి కి చెందిన డాక్టర్ నైనారు పొన్నారావును రాష్ట్ర ప్రభుత్వం నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.. ఈ మేరకు టిడిపి రాష్ట్ర కార్యాలయం నుంచి సమాచారం అందినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా నామినేటెడ్ పోస్టులను ప్రకటించిన విషయం తెలిసిందే. రెండో విడత నామినేటెడ్ పోస్టులను రేపే మాపో ప్రకటించే అవకాశం ఉంది. అందులో తిరుమల తిరుపతి, శ్రీకాళహస్తి, దోయకొండ దేవస్థానాలకు పూర్తిస్థాయి పాలకమండలి అధ్యక్షులను, బోర్డు సభ్యులను ప్రకటించనున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ నైనారు పొన్నారావు శ్రీకాళహస్తి ఆలయ బోర్డ్ ఛైర్మన్‌గా మొదటి వరుసలో ఉన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా పొన్నారావు వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. 1983 టిడిపి స్థాపించినప్పటి నుంచి ఏ పదవులు ఆశించకుండా పార్టీకి వీరాభిమానిగా పనిచేస్తున్నారు. చాలా ఏళ్ళుగా ఏర్పేడు మండలం టిడిపి మండల అధ్యక్షులుగా కొనసాగుతూనే ఉన్నారు.. బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన ఆ సామాజిక వర్గంపై బలమైన పట్టుంది. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఈ మండలం టిడిపి మెజార్టీ సాధించింది. ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్ రెడ్డి కూడా పార్టీ అధిష్ఠానంకి వస్తే పొన్నారావుకు సముచిత స్థానం కల్పిస్తామని కూడా హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు కూడా పొన్నారావు సుపరిచితుడే..



సిఎం చంద్రబాబుతో పొన్నారావు (ఫైల్‌ఫోటో)

సుప్రీం కోర్టు ఆదేశాలపై హర్షం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయటాన్ని సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ స్వాగతిస్తున్నదని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని, జరగలేదని వాదోపవాదాలు సాగుతున్న సమయంలో సుప్రీంకోర్టు చొరవచూపి స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించటం సమంజసమైనదని విచారణ వేగంగా పూర్తి చేయాలని అప్పటివరకు రాజకీయపక్షాలు, సంస్థలు, వ్యక్తులు, సంయమనం పాటించాలని ఆయన కోరారు.

సిఐటియు హర్షం

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో సాగుతున్న అయోమయానికి, చర్చలకు స్వస్తి పలకటానికి సుప్రీంకోర్టు చొరవ చూపి ఐదుగురు సభ్యులతో స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయటం పట్ల సిఐటియు హర్షం తెలియజేస్తున్నదని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. లడ్డూ వ్యవహారంలో సాగుతున్న చర్చలకు, సవాళ్లకు రాజకీయపక్షాలు ఇతర సంస్థలు పుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందని, సంయమనం పాటించకుండా మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే రీతిలో ఉపన్యాసాలకు స్వస్తి పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విచారణలో నిజ, నిజాలు వెల్లడవుతాయని, అప్పటివరకు వేచి ఉండాలని ఆయన ఆ ప్రకటనలో అన్ని పక్షాలకు విజ్ఞప్తి చేశారు.

హోం నీడ్స్ ప్రో అప్లికేషన్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

గృహ అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా హోం నీడ్స్ ప్రో అప్లికేషన్ యాప్‌ను శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్లో హోం నీడ్స్ ప్రో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కిన్నెర బాలాజీ మాట్లాడుతూ గృహసేవా అవసరాలను తమ యాప్ ఒక చిన్న క్లిక్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గృహసేవా పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గూగుల్ ప్లేలో తమ యాప్‌ను డౌన్లోడ్ చేసుకు నామమాత్రపు రుసుంతో మా సేవలను పొందవచ్చని తెలిపారు. సౌలభ్యం, నాణ్యత, సంతృప్తిని వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా సేవలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కార్పెంటర్, ప్లంబింగ్, హౌస్ కీపింగ్, బ్యూటీషన్ వంటి ఐదు గృహసేవా అవసరాలు అందుబాటులో ఉన్నాయని, రాబోవు కాలంలో మరిన్ని గృహసేవ అవసరాలను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

డేవిడ్ రీస్ ఆసుపత్రిలో

నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : డేవిడ్ రీస్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన భవనాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆ ట్రస్ట్ జనరల్ సెక్రెటరీ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ బొజ్జల కుటుంబం చేసిన సేవలకు గాను ఆ ఆసుపత్రి లోని ఒక భవనానికి బొజ్జల భవనమని నామకరణం చేసినట్లు తెలిపారు. 1970వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి దాదాపు 20 వేల మందికి సేవలను అందించామని, ఆ సేవలకు బొజ్జల కుటుంబం మూడు తరాలుగా ఎమ్మెల్యే తాత బిజీ సుబ్బరామిరెడ్డి, తదనంతరం గోపాల కృష్ణారెడ్డి ఈ ట్రస్ట్‌కి అధ్యక్షులుగా ఉంటూ ఎనలేని సేవలు అందించారని తెలియజేశారు. ఇప్పుడు అదే విధంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తోడ్పాటును అందిస్తునారని అన్నారు. అనంతరం ఏర్పేడులోని మెర్సీ క్లినిక్‌ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మా తాత, మా తండ్రి ఈ ఆసుపత్రికి ఎనలేని సేవలు అందించారని, తాను కూడా ఈ ఐదు సంవత్సరాలలో ఈ ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. వైబిఎస్ఎస్ అధ్యక్షులు డాక్టర్ శంకర్ ప్రసాద్ రెడ్డి, ఫౌండర్ మెంబర్ బైకిరెడ్డి, డేవిడ్ రీస్ ఆసుపత్రి డైరెక్టర్ ఏంరీస్ రీస్, డాక్టర్ స్వాతి కరణం, డాక్టర్ ప్రతాప్ నాయుడు, విన్సెంట్ తదితరులు పాల్గొన్నారు

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఎన్‌జిఓ కాలనీలోని ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు నివాసం వద్ద తిరుపతి టైలర్స్ అసోసియేషన్ వారు రూ.50,000ల విరాళంను విజయవాడ వరదబాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, నరసింహులు నాయుడు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, కార్యదర్శి నూర్జహాన్, వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, జాయింట్ సెక్రటరీ మణి, కోశాధికారి రామమూర్తి పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి



ధ్వజారోహణం

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సేవకులు ప్రతి భక్తునిలో శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శిస్తూ, అత్యంత భక్తి, అంకితభావంతో, క్రమశిక్షణతో ఉత్తమమైన సేవలను అందించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు కోరారు. తిరుమల ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీవారి సేవకులను ఉద్దేశించి ఈవో మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు దాదాపు 4వేల మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఆహ్వానించిందన్నారు. భక్తులకు శ్రీవారి సేవకులు అందిస్తున్న సేవలు, ప్రత్యేకంగా అన్నప్రసాదం, తాగునీరు, లడ్డూ ప్రసాదాల పంపిణీ, శ్రీవారి ఆలయం, కల్యాణకట్ట, బయటి ప్రదేశాల్లో క్యూ లైన్ల నిర్వహణ, అనేక కార్యక్రమాలలో శ్రీవారి సేవకుల సేవలను కొనియాడారు. అనంతరం శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఫొటో ప్రదర్శనశాలలను టీటీడీ ఈవో, అదనపు ఈవో ప్రారంభించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాళ్లను అభినందించారు. జేఈవో గౌతమి, సివిఎస్‌వో శ్రీధర్, ఉద్యానవన డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఫారెస్ట్ డిప్యూటీ కన్జర్వేటర్ శ్రీనివాసులు, ఎస్వీ ప్రిన్సిపాల్ వెంకట్రమణా రెడ్డి, సీపీఆర్‌వో డాక్టర్ టి.రవి పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

తిరుమలలోని రాంభగీచా- 2 విశ్రాంతి భవనం మొదటి అంతస్తులో శుక్రవారం మధ్యాహ్నం టీటీడీ ఈవో, అడిషనల్ ఈవో, సివిఎస్వో శ్రీ శ్రీధర్ మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈఓ మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేంతవరకు రాంభగీచా- 2 రెండవ అంతస్తులో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక అన్నప్రసాదం సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తొమ్మిది రోజుల్లో జరిగే వివిధ ధార్మిక కార్యక్రమాలు సంబంధించి మీడియాకు ఎప్పటికప్పుడు ప్రెస్‌నోట్స్, ఫోటోలను పిఆర్ డిపార్ట్‌మెంట్ విడుదల చేస్తుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులకు శ్రీవారి వైభవాన్ని మరింత విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సిపిఆర్‌వో డాక్టర్ టి.రవి, పిఆర్ఓ (ఎఫ్ఏసీ) కుమారి పి.నీలిమ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీవారికి పట్టువస్త్రాలు తెస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో తొలిరోజైన శుక్రవారం రాత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వరస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ముఖ్యమంత్రి బేడి ఆంజనేయస్వామివారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకట చౌదరి స్వాగతం పలికారు. ఆ తరువాత ముఖ్యమంత్రి ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదమంత్రోచ్చారణతో వేద పండితులు ఆశీర్వదించారు. టీటీడీ ఈఓ ముఖ్యమంత్రికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రామ్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర, ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ

డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో మొదటి రోజైన శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీటీడీ ముద్రించిన 2025వ సంవత్సరం డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. 12 పేజీల క్యాలెండర్లు 13.50 లక్షలు, పెద్ద డైరీలు 8.25 లక్షలు, చిన్నడైరీలు 1.50 లక్షలు, టేబుల్ టాప్ క్యాలెండర్లు 1.25 లక్షలు, శ్రీవారి పెద్ద క్యాలెండర్లు 3.5 లక్షలు, శ్రీపద్మావతి అమ్మవారి పెద్ద క్యాలెండర్లు 10 వేలు, శ్రీవారు శ్రీపద్మావతి అమ్మవారి క్యాలెండర్లు 3 లక్షలు, 6 షీట్ క్యాలెండర్లు 50 వేలు, టీటీడీ స్థానిక ఆలయాలు 10 వేలు, తెలుగు పంచాంగం క్యాలెండర్లు 2.50 లక్షల కాపీలను టీటీడీ ముద్రించింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో, అదనపు ఈవో పాల్గొన్నారు. 2025 టీటీడీ డైరీలు, క్యాలెండర్లు అక్టోబరు 5వ తేదీ నుండి తిరుమల, తిరుపతిలో అందుబాటులో ఉంటాయి. అక్టోబరు రెండో వారం నుండి ఇతర ప్రాంతాల్లో భక్తులకు అందుబాటులో ఉంటాయి.

ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం 5.45 నుండి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు, ఆగమ సలహాదారులు, టీటీడీ ఈవో శ్యామలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో ఎటువంటి అపచారం జరగలేదు

వదంతులను నమ్మకండి: టీటీడీ

తిరుమల శ్రీవారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజైన ధ్వజారోహణం నాడు, ధ్వజస్తంభంపై గరుడ ధ్వజపటాన్ని ఎగురవేసే తాలూకు కొక్కి విరిగిపోయిందని, ఇది అపచారమని కొన్ని ప్రసార మాధ్యమాల్లో, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వదంతులు వస్తున్నాయి. శ్రీవారి భక్తులు ఇటువంటి వదంతులు నమ్మవద్దని టిటిడి కోరింది. సాధారణంగా బ్రహ్మోత్సవాల మునుపే ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేసుకోవడం ఆనవాయితీ. ఏవైనా భిన్నమైన వస్తువులు ఉంటే వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చడం సంప్రదాయం. అందులో భాగంగానే భిన్నమైన ధ్వజపటం తాలూకు కొక్కిని అర్చకులు తొలగించి దాని స్థానంలో కొత్త దాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అంతలో దీనిని అపచారం జరిగినట్లుగా కొన్ని ప్రచార మధ్యమాలు ప్రసారం చేయడం దురదృష్టకరం. తిరుమలలో ఎటువంటి అపచారం జరగలేదని, భక్తులు ఇటువంటి వదంతులు నమ్మవద్దని టీటీడీ తెలిపింది.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం



సిఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- రేణిగుంట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం తిరుమల శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించటానికి, వకుళా మాత కొత్త సెంట్రల్ కిచెన్ ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాల్లో పాల్గొనుటకు తిరుమల తిరుపతి రెండురోజుల పర్యటన నిమిత్తం సాయంత్రం 4.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సిఎంకి ఘన స్వాగతం లభించింది. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి బాచ్‌పాయ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఓ పెంచల్ కిషోర్, ఎమ్మెల్యేలు నగరి భాను ప్రకాష్, చిత్తూరు గురజాల జగన్మోహన్, జిడి నెల్లూరు థామస్, పలమనేరు ఎన్.అమర్నాథ్ రెడ్డి, తిరుపతి ఆరని శ్రీనివాసులు, శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు వెలగపల్లి వరప్రసాద్, సుగుణమ్మ, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అలాగే డాలర్స్ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ డాక్టర్ సి.దివాకర్ రెడ్డి కూడా స్వాగతం పలికారు. అలాగే చంద్రబాబుకు వెంకన్న విగ్రహంను శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్చార్జి కోట వినుత బహూకరించారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులు డాక్టర్ నైనారు పొన్నారావు మర్యాదపూర్వకంగా కలిశారు.

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

తిరుపతి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన మార్గాల్లో పారిశుద్ధ్య పనులను, ఏర్పాట్లను శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులతో కలిసి పరిశీలించారు. సాయంత్రం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు రానున్న నేపథ్యంలో తనపల్లి క్రాస్ నుండి శ్రీనివాససేతు ఫ్లైఓవర్ మీదుగా అలిపిరి వరకు పారిశుద్ధ్య పనులను ఇంజనీరింగ్ హెల్త్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉండాలని, బారికేడ్లు పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపైన ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని, ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో ఫ్లెక్సీలు అడ్డం ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు తులసీ కుమార్, గోమతి, డీఈ మహేష్, రాజు, ఏసిపి బాలాజీ, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య ఉన్నారు.

వైద్య విద్యార్థులకు

స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ఎస్వి వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థుల స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినా ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిఏ.చంద్రశేఖరన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, (విజయవాడ,) నేషనల్ మెడికల్ కమిషన్ (న్యూఢిల్లీ) వారి ఆదేశాల మేరకు ఈ క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లు ఎస్వి వైద్య కళాశాల క్రీడామైదానంలో, వెటర్నరీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో, అగ్రికల్చర్ కాలేజ్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ క్రీడల్లో దాదాపు 15 వైద్య కళాశాలలు, దంత వైద్యకళాశాలలు దాదాపు 300మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొంటున్నారని, వీరికి వసతి ఏర్పాట్లు అన్నీ కూడా ఎస్వీ వైద్య కళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ వసతి గృహంలో కల్పించడం జరుగుతుందని తెలిపారు. రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి.రవి ప్రభు, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి, ఎస్వీ వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ ఫహీమ్, డాక్టర్ త్రిమూర్తులు, డాక్టర్ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం (ఫిజికల్ డైరెక్టర్), ఫిజికల్ డైరెక్టర్ శరవనన్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

విద్యుత్ తీగ తెగి యువకుడు మృతి

- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- విద్యుత్ కార్యాలయం ఎదుట బంధువుల ధర్నా

ప్రజాశక్తి -సత్యవేడు: అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ తీగ తెగి యువకుడు దుర్మరణం చెందాడు. ఆగ్రహించిన మృతుడి బంధువులు విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా చేపట్టడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఈ సంఘటనపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

సత్యవేడు మండల కేంద్రంలోని కోమటి గుంటకు చెందిన జమాల్ అలియాస్ సంపత్ (36) గురువారం రాత్రి 10 గంటలకు విద్యుత్ తీగ తెగి ఇంటిపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో వర్ష సూచనతో కొంత ఈదురుగాలి కొట్టడంతో ఉన్నట్లుండి కోమటిగుంట ప్రాంతంలో విద్యుత్ స్తంభం తీగలలో మంటలు చెలరేగాయి. వెంటనే వీధి దీపాలు ఆరిపోవడంతో ఆ ప్రాంతమంతా చీకటి అలుముకుంది. ఇదే సమయంలో ఆ వీధిలో అరుపులు విన్న సంపత్ ఇంట్లో నుండి బయటకు వచ్చే క్రమంలో తన ఇంట కంచెపై తెగి పడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్ది సేపటి తర్వాత దీన్ని గమనించిన భార్య, ఇద్దరు చిన్నపిల్లల అరుపులు, కేకలు విన్న గ్రామస్తులు అందరూ వచ్చి విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేయగా దాదాపు ఒక గంట సమయం అనంతరం విద్యుత్ సిబ్బంది హాజరయ్యారు. అనంతరం విద్యుత్ సరఫరా నిలిపి సంపత్‌ను పరిశీలించగా అప్పటికే చనిపోయాడని గమనించి వెంటనే హుటాహుటిన స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. బాధితులు ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి సత్వర పరిష్కారం కోసం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి చెన్నై రహదారిని దిగ్బంధం చేసి ఈ ఘటనకు విద్యుత్ శాఖ అధికారులు పూర్తి బాధ్యత వహించి మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

ధర్నా నిర్వహిస్తున్న మృతుడి బంధువులు
ఇన్‌సెట్‌లో మృతుడు సంపత్ (ఫైల్ ఫోటో)

చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బంధువులు మాట్లాడుతూ మృతుడు కూలి పని చేసుకుంటూ జీవనం గడిపే వాడని తన మీద ఆధారపడి భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని ఈ కుటుంబాన్ని మంచి మనసుతో ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించుకున్నారు. పోలీసుల రంగ ప్రవేశం చేసి ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులతో చర్చించి పూర్తి విచారణ చేసి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. అనంతరం మృతదేహానికి స్థానిక ప్రభుత్వ వైద్య కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అధికారుల వివరణ

ఈ ఘటనపై అధికారులను వివరణ కోరగా అధికారులు స్పందిస్తూ సత్యవేడు పట్టణం మొత్తానికి దాదాపు 9 వేలు విద్యుత్ కనెక్షన్లు, 80 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న మొత్తం నిర్వహణ కోసం ఒకే లైన్‌మ్యాన్ వున్నారని తనకు సహాయకులు లేరని ఉన్నా ఒక్క సహాయక లైన్‌మ్యాన్ ఉద్యోగ బదిలీపై వెళ్లాడని సిబ్బంది కొరత తీవ్రంగా వుందని సూచించారు. దీన్ని అనుసరించి విద్యుత్ తీగలను కోమటి గుంట ప్రాంతంలో ఎందుకు పున: నిర్మించలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ నమూనాలు, ఉపకరణాల కొరత తీవ్రంగా వుందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ ప్రాంతంలో ఉన్న విద్యుత్ తీగలు అన్ని త్వరలో పున: నిర్మిస్తామని సూచించారు.

క్రైం న్యూస్

మహిళ హత్య

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ : ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. రామలింగాపురం యానాది కాలనీలో నివసిస్తున్న కోటమ్మ (40) భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేది.వెంచయ్య అనే అతనితో పరిచయం ఏర్పడి ఆరు నెలలుగా కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆరు నెలల గడవకముందే వెంచయ్య తాగేసి వచ్చి తరచూ గొడవ చేయడంతో గత కొన్ని రోజులుగా ఇంట్లో వాళ్ళ మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఫుల్లుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భర్త కోటమ్మతో గొడవ పెట్టుకొని కర్రతో బలంగా తలపై కొట్టడంతో కోటమ్మ అక్కడికక్కడే పడిపోయింది. రాత్రి కావడంతో వెంచయ్య అక్కడ నుండి పరారయ్యాడు. ఉదయం కోటమ్మ ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉండడం చూసిన చుట్టుపక్కల వాళ్లు కోటమ్మ మృతి చెందినట్లు తెలుసుకొని శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. కోటమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖిలో భక్తుడు మృతి

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: స్నానం చేసేందుకు నదిలోకి దిగిన ఓ భక్తుడు స్వర్ణముఖి లో మునిగి మృతి చెందాడు. స్నాన ఘట్టం వద్ద సూచిక బోర్డు పెట్టకపోవడం వల్లే అమాయక భక్తుడు ప్రాణాలు కోల్పోయాడంటూ సహచర భక్తులు ఆరోపించారు. కార్వేటి నగరానికి చెందిన చంద్రశేఖర్ తన భార్యతో కలిసి శుక్రవారం దుర్గాదేవి మాల వేసేందుకు శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. ఈ క్రమంలో ఆలయ రెండో గేటు సమీపంలోని సన్నిధి వీధి గంగాసదన్ ఘాట్ వద్ద భార్య దుర్గాదేవి మాలను ధరిస్తుండగా, చంద్రశేఖర్ స్వర్ణముఖి నదిలో స్నానం చేసేందుకు ఉపక్రమించాడు. అయితే లోతు తెలియక, ఈత రాక అందులో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. స్నానానికి వెళ్లిన తన భర్త ఎంతసేపటికి రాకపోవడంతో స్థానికుల సాయంతో నదిలో వెతకగా చంద్రశేఖర్(35) మృతదేహం బయటపడింది. వన్ టౌన్ పోలీసులు మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి: ఏపీవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ భానుప్రియ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కుక్కంబాకం పంచాయతీలో ఉపాధి పనులు, కూలీల హాజరును ఆమె పరిశీలించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలో రెండు వేల మంది కూలీలు పనిచేయాల్సి వుండగా 1,100 మంది మాత్రమే పనిచేస్తున్నారని, కూలీల సంఖ్యను పెంచకపోతే ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 272 కూలి గిట్టుబాటు అవుతుందని, ప్రతి గ్రామ పంచాయతీలో పండ్ల తోటలు పెంపకం చేసుకోవాలని ఈ పండ్ల తోటలలో నిమ్మ మామిడి సపోటా వేగన్ ప్రూట్స్ కొన్ని రకాల పండ్ల తోటలకు ప్రభుత్వం రైతులకు పండ్ల తోటలపై అవగాహన కల్పించి వారికి ఉపాధి హామీ ద్వారా సబ్సిడీతో వీటిని ఏర్పాటు చేయాలని కోరారు. పండ్ల తోటల్లో రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి నెలాఖరులోపు దరఖాస్తులను స్వీకరించాలన్నారు. పనుల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో భానుప్రియ

వచ్చే ఏడాదికి స్కిట్ ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే విద్యా సంవత్సరానికి శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పున:ప్రారంభిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. స్థానిక స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జేఎన్‌టియు హైయ్యర్ ఎడ్యుకేషన్ కమిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే బొజ్జల సమావేశమయ్యారు. స్కిట్ కు పూర్వవైభవం తీసుకురావాలంటే తీసుకోవాల్సిన చర్యలపై జేఎన్‌టియూ కమిటీ డైరెక్టర్ డాక్టర్ రామ్ మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి హయాంలో ఓ వెలుగు వెలిగిన స్కిట్ తదనంతర కాలంలో అనేక కారణాల రీత్యా మసక బారిందని ఎమ్మెల్యే అన్నారు. బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మానస పుత్రికగా ఎదిగిన స్కిట్ కు పూర్వవైభవం తీసుకురావాలని కృత నిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల హామీలో భాగంగా స్కిట్ ను జేఎన్టీయూ సహకారంతో వచ్చే విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభి స్తామన్నారు.

జేఎన్‌టియు ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు ఈవోపీఆర్‌డీగా మోహన్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవోపీఆర్‌డి మోహన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఈవోపిఆర్‌డీగా మోహన్ శుక్రవారం గూడూరు పట్టణంలోని ఎంపిడివో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఓజిలి నుండి బదిలీ పై గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సంస్కృత విశ్వవిద్యాలయంలో సరస్వతీ పూజ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని ప్రధాన గ్రంథాలయంలో శుక్రవారం సరస్వతీ పూజను డిప్యూటీ లైబ్రరీ డాక్టర్ వసంత్, గ్రంథాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్వవిద్యాలయ విసి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా, ప్రణాళికా బద్ధంగా పాఠాలను చదివి, పరీక్షలను అర్థవంతంగా రాసి ఉన్నత మార్కులతో కోర్సులను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొ.ఎన్.లత, న్యాయశాస్త్ర వరిష్టాచార్యులు ప్రొఫెసర్ సంపత్ కుమార్ ఆచార్యులు, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వెంకన్న విగ్రహం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత, చంద్రబాబు దంపతులు కొయ్యతో తయారు చేసిన కొండపల్లి వెంకటేశ్వర స్వామి బొమ్మను బహూకరించారు. అనంతరం చంద్రబాబుతో శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిస్థితులపై కొదిసేపు చర్చించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి నామినేటెడ్ పదవుల్లో జనసేన కార్యకర్తలకు పెద్దపీట వేయాలని కోరారు.

ఆత్మ రక్షణలో జగన్ అండ్ కో: టిడిపి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి విషయంలో విచారణ జరపాలని ఇచ్చిన సుప్రీం తీర్పుతో జగన్ అండ్ కో ఆత్మరక్షణలో పడిందని టీడీపీ బిసి విభాగం నాయకులు విమర్శించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తిరుమల మొత్తాన్ని తన బంధువర్గంతో నింపి జగన్ అపవిత్రం చేశారని, నేటికి వారి పాపం పండిందన్నారు. టిటిడి ఛైర్మన్‌లుగా గతంలో పనిచేసిన భూమన, వైవీలతో ఈవో ధర్మా రెడ్డి చేతులు కలిపి ఏఆర్ డెయిరీ ద్వారా కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపించారు. నెయ్యిలో అక్రమాలను సిట్ బయటకు తీస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మిన్నల్ రవి, డాక్టరు యం ఉమేష్ రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక అనాథ వృద్ధాశ్రమంలోని మహిళలకు అడ్వకేట్ సీఎం దిలీప్ మొదలియార్ గురువారం ఆహార ప్యాకెట్లు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ తన తండ్రి సీఎస్‌బాబు మంచి ప్రభుత్వ ఉద్యోగిగా, రాజకీయాల్లో పార్టీలకు అతీతంగా ఎవరు వచ్చి అడిగిన వెంటనే స్పందించి విలువలతో కూడిన రాజకీయం సేవ చేసేవారు అన్నారు. ప్రతి సంవత్సరం తన తండ్రి జ్ఞాపకార్థం అక్టోబర్ మూడో తేదీ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మిత్రులు మనోహర్ రెడ్డి, కుట్టీ, ఎస్ ఆర్ చిన్న, శివ, వేణు రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : స్విమ్స్,శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం తొగరాముడి పిహెచ్ సి పరిధిలోని మీజూరులోని అంగన్‌వాడీ స్కూల్లో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 40 ఏళ్ల పైబడిన మహిళలందరూ మూడేళ్లకోసారి రొమ్ము క్యాన్సర్,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ క్యాంపునకు విశేషంగా ప్రజలు విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.

కలుపు మందులతో భూములు నిర్జీవం: ఏడీఏ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: కలుపు మందుల వాడకంతో భూములు నిర్జీవం అవుతున్నాయని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. మండలంలోని వెస్ట్ వరవత్తూరు పంచాయతీలో శనివారం ఉదయం కలుపు మందుల వాడకంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏడీఏ భాస్కరయ్య మాట్లాడుతూ పంట పొలాలకు అధికంగా కలుపు మందులు వాడడం వల్ల భూములు నిర్జీవమై పంట సాగుకు పనికి రాకుండా పోతాయని పేర్కొన్నారు. కలుపు మందులు భూమిలోని జీవరాశిని అంతం చేసి భూమిని నిస్సారం చేస్తుందన్నారు. సక్రమంగా పొలం తయారు చేసుకుంటే కలుపును చాలా వరకు నివారించు కోవచ్చని తెలిపారు. వరిలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి ఏవో వేణుగోపాల రావు వివరించారు. కాకర, మిరప పంటల సాగు, చీడల నివారణ గురించి రాస్ కెవికె శాస్త్రవేత్త సుధాకర్ రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి భారతి, మండలం లోని వ్యవసాయ శాఖ అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు భరత్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ భాస్కరయ్య

నైపుణ్యత, మేధస్సు పెంపునకే 'మోహన్ మంత్ర': మంచు విష్ణు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): విద్యార్థులలో మేధస్సు నైపుణ్యతను వెలికి తీయడానికి మోహన్ మంత్ర ఎంతో ఉపయోగ పడుతుందని ప్రో ఛాన్సలర్ మంచువిష్ణు అన్నారు. గురువారం మండలంలోని ఏ రంగంపేట సమీపంలో శ్రీ సాయినాథ్ నగర్‌లోని ఎంబీయూలో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే మోహన్ మంత్రను ముఖ్య అతిథిగా హాజరైన ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి దాదాపు 20 వేలమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన విద్యా సంస్థలలో మోహనమంత్రను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని, మేధస్సును, నైపుణ్యాన్ని వెలికితీయడమే మోహన్ మంత్ర ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. విద్యా సంస్థలలో పనిచేసే సిబ్బంది ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చిన విద్యార్థులను అతిథులుగా భావించి గౌరవించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు డ్యాన్సు చేయడం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టెక్ ఎగ్జిబిషన్, త్రీడీ డిఎండి పోటీ, హ్యాకథాన్, క్విజోనామిక్స్, బ్రిడ్జ్–ఓ–మానియా, లాగ్ లేకుండా జెండాను కనుగొనండి, కోడ్ స్ప్రింట్, వర్చువల్ మోడలింగ్, రోబో వార్, బ్రీవిటీ బ్లిట్జ్, స్పెల్ క్వెస్ట్ అండ్ (లెట్స్ నాచో, రాంప్ వాక్, బ్యాండ్ బ్యాటిల్, పిక్చర్ పర్ఫెక్ట్, చికెన్ డిన్నర్, పబ్జి, అల్టిమేట్ బ్యాటిల్ (షార్ట్ ఫిల్మ్), సిట్‌కామ్, రీల్ మాస్టర్, స్టాండ్–అప్ టాకీస్, మీమ్ ఛాలెంజ్, గల్లీ క్రికెట్, ట్రెజర్ హంట్, తదితర కార్యక్రమాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వై ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామరావ్, ఛీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్సు వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టరు కె సారధి, డీన్లు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలను తిలకిస్తున్న ఎంబియూ వైస్ ఛాన్సలర్ మోహన్‌బాబు

పౌష్టికాహారంతోనే మాతాశిశు మరణాల నిర్మూలన: సిడిపిఓ

బుచ్చినాయుడు కండ్రిగ- ప్రజాశక్తి: గర్భిణులు, బాలింతలు సకాలంలో పౌష్టికాహారం తీసుకుని వైద్య పరీక్షలు, ఆరోగ్య సూత్రాలు పాటిస్తే మాతా శిశు మరణాలను నిర్మూలించవచ్చని సిడిపిఓ ఆర్ దేవ కుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐసిడిఎస్ అధికారుల సమక్షంలో పౌష్టికాహారం విలువలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహారం పదార్థాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపరువైజర్ సి శిల్ప, టిడిపి మండల అధ్యక్షులు మావిళ్ళపల్లి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన తర్వాత సకాలంలో మంచి పౌష్టికాహారం, వైద్యుల సలహా మేరకు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే శిశువు ఆరోగ్యవంతంగా ఉంటుం దన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తర్వాత బాధపడాల్సి వస్తుందని ప్రతి గర్భవతి బాలింతలు సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ ఆరోగ్యం శిశువు పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛమైన పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు , రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ నాగరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ కే యమునా, ఎం జ్యోతి, హెల్త్ సూపర్వైజర్ జ్యోతి, ఆశ వర్కర్లు , అంగన్‌వాడీలు, టీచర్లు సుదర్శనం, ప్రసూన పాల్గొన్నారు.

సామూహిక సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

రైతులు సానుకూలంగా స్పందిస్తే న్యాయం : తహశీల్దారు

ప్రజాశక్తి -కోట : ప్రభుత్వ భూములును సాగు చేసుకుంటున్న ఇరువురి రైతులు సానుకూలంగా స్పందిస్తే రైతులందరకి న్యాయం లభిస్తుందని స్థానిక తహశీల్దార్ కటారి జయ జయ రావు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని కొత్తపట్నం పంచాయతీ పరిధిలో ఉన్న 698,699 సర్వే నెంబర్ లో ఉన్న 25 ఎకరాల భూమిని యమదిన్నెపాలెం,పల్లెవాని దిబ్బ రైతులు ఆక్రమించుకుని వుంటే ఆ భూమిని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాలు మేరకు శుక్రవారం సాగరమాల టీమ్ ఆధ్వర్యంలో సర్వే చేయడానికి ప్రయత్నించగా ఇద్దరూ కలిసి 'ఇది మా భూమి..' అంటూ వాదోపవాదనలతో అడ్డుకున్నారు. ఈ మేరకు సాగరమాల పరిహారం అందజేసే క్రమంలో పెండింగ్‌లో వున్న భూమిని ఎంజాయ్‌మెంటు తీయాలని కొత్తపట్నం భూములను సర్వే చేయడానికి వెళ్లామన్నారు. అయితే అక్కడ ఉండే రైతులు ఒకరికొకరికి పడక సర్వేను అడ్డుకున్నారని తెలిపారు. రైతులిద్దరూ సానుకూలంగా స్పందిస్తే అర్హులైన రైతులందరికి న్యాయం జరుగు తుం దని, లేదంటే ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణిస్తామని తహశీల్దార్ కటారి జయ జయ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగరమాల టీమ్ డక్కిలి తహశీల్దారు, ఆర్ఐ, స్థానిక విఆర్ఓ శ్రీనివాసులు, మండల సర్వేయర్ గోపి రెడ్డి వున్నారు.

గ్రీన్ అంబాసిడర్లను ఆదుకోవాలి..

ప్రజాశక్తి - సత్యవేడు:

సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులు పారిశుద్ధ్య కార్మికుడుని ఆదుకోవాలని పిలుపు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ సత్యవేడు మండలం ఏ ఎం పురం గ్రామంలో క్యాన్సర్ వ్యాధికి గురైన గ్రీన్ అంబాసిడర్ పారిశుద్ధ్య కార్మికుడైన గోపిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.గత కొంత కాలంగా గోపి తలకు సంబంధించిన క్యాన్సర్ వ్యాధితో బాధపడతూ చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రముఖ ఆసుపత్రికి వెళ్లగా సుమారు 6 లక్షల నుండి 7 లక్షల రూపాయలు ఖర్చవుతుందని ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ హెల్త్ కార్డులు తమ హాస్పిటల్లో అమలులో లేదని చికిత్స కయ్యే మొత్తం ఖర్చు మీరే భరించాల్సి ఉంటుందని చెప్పడంతో నిరుపేదవాడైన గోపి ఖర్చును భరించలేమని తెలిసి ఇంటికి వచ్చిన వేణు తిరిగి మంచానికే పరిమితమైంది. వ్యాధితో పోరాడుతూ జీవించడం చాలా విచారకరమని తన ఆవేదనను వ్యక్తపరిచారు. పరిసరాలను పరిశుభ్రపరచి మనలను రక్షించే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం, ఉద్యోగ భద్రత ఆరోగ్య బీమా లేకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తేటతెల్లంగా తెలుస్తోందని దుయ్యబట్టారు. సాయం చేయాలనుకున్న వారు 95550664341 ఫోన్ నెంబర్‌కు ఫోన్ పే ద్వారా తమకు తోచినంత సాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ కార్మిక సంఘ అధ్యక్షులు శేఖర్ కార్యదర్శి మునస్వామి, సభ్యులు సుబ్రమణి ,చంద్రబాబు గోవిందమ్మ లక్ష్మి సుశీల పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి సాధించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి -రామచంద్రపురం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడదామన్నారు. ఈ వర్షాకాలంలో గ్రామాలలో అంటూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జడ్పిటిసి ఢిల్లీ రాణి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు అయిన పక్కాభవనాలు డిసెంబర్ లోపల పూర్తి చేయాలని చెప్పారు.అన్ని గ్రామాలలో వీధిలైట్లు వెలగడానికి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.గ్రామాలలో పారిశుధ్యనికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రాయితీతో విత్తనాలను అందించామని సభకు తెలిపారు.ప్రభుత్వం నుంచి వ్యవసాయానికి సంబంధించిన సేవలు పొందాలంటే తప్పకుండా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. రామచంద్రపురం మండల కేంద్రంలోని సింగల్ విండోలో ఎరువులు అమ్మకానికి లైసెన్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలతో పంట పొలాలను పరిశీలన చేసి తగిన ఎరువులను వాడటానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.రాయితీతో రైతులు బిందు సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకోవాల్సిన విధానాన్ని వివరించారు. మండల పశువైద్యులు డాక్టర్ జయ కిషోర్ మాట్లాడుతూ వ్యాధుల నివారణకు పెద్ద సంఖ్యలో పశువులకు టీకాలు వేశామన్నారు. పదివేలకు పైగా మేకలు గొర్రెలు వంటి జీవాలకు వివిధ రకాల టీకాలు ఇచ్చినట్లు తెలిపారు. కుప్పం బాదురు వైద్యాధికారిణి డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ మండల పరిధిలోని కుప్పం బాదూరు కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొత్తం 163 మంది గర్భిణీలను గుర్తించామన్నారు.వీరికి క్రమం తప్పకుండా వివిధ రకాల పరీక్షలు నిర్వహిస్తూ తగిన సూచనలు సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. మాతాశిశు మరణాల రేటు తగ్గించడానికి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామన్నారు రాత్రి వేళలలో ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మద్యం ప్రియుల ఆగడాలు శృతిమించుతున్నట్లు సభ దృష్టికి తీసుకుని వచ్చారు. వెలుగు ఏపిఎం గురుమూర్తి ప్రసంగించారు. డిప్యూటీ తాశీల్దార్ అన్వర్ బాషా మాట్లాడుతూ రెవెన్యూ కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కార్యా లయంలో సంప్రదించాలని సూచించారు. ట్రాన్సుకో ఏఇ గిరి మాట్లాడుతూ కరెంటు సరఫరా కు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత సిబ్బందికి తెలపాలన్నారు. లైన్లకు తగులుతున్న జంగిల్ క్లియరెన్స్ కు అందరూ సహకరించాలని కోరారు. ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ మండలంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందరూ సమన్వయం చేసుకుంటూ పరుగులు పెట్టిద్దామన్నారు.ప్రజా సేవకులుగా మన బాధ్యతలను మన విధులను నిర్వహించటానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఉపాధి హామీ ఏపీవో హంస వేణి, అటవీ శాఖ ఎఫ్బి ఓ తులసయ్య, అంగన్‌వాడీ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కాకాణికి వైసీపీ నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నాయుడుపేట: సుళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి అధ్యక్షులుగా నియమితులైన కాకాణి గోవర్ధన్ రెడ్డికి నాయుడుపేట వైసీపీ నాయకులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. మాజీ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తోపాటు మండల కన్వీనర్,మున్సిపాలిటీ కౌన్సిలర్లు, మున్సిపల్ ఛైర్ పర్సన్ , వైస్ ఛైర్మన్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీగా తరలివచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డికి శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని,పార్టీ బాధ్యతలు నిర్వర్తించేవారు క్రమశిక్షణతో, కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి కాకాణి కోరారు. రాష్ట్రంలో ఏ రోజు ఎన్నికలు వచ్చినా,సుళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యునిగా కిలివేటి సంజీవయ్యను మళ్లీ తిరిగి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రాష్ట్రంలో చంద్రబాబు వంద రోజుల పాలనలోనే ప్రజలు విసిగి పోయారని, చంద్రబాబు వైఫల్యాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఏకమై, ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండల మాజీ కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక,వైసీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి ఈద రత్నశ్రీ, మున్సిపల్ కౌన్సిలర్లు ధారా రవి, షేక్ షబ్బీర్ , కావేరి పాకం అశోక్ కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కాకాణిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

నరేంద్ర బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ సురేంద్రకుమార్

ప్రజాశక్తి -వెంకటగిరి: వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా నరేంద్ర కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జంగారెడ్డి గూడెంనుండి వెంకటగిరికి వచ్చారు. గతంలో నరేంద్ర కుమార్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన అనుభవం వుంది. వెంకటగిరి సెంటర్ లైటింగ్ ఏర్పాట్లలో సైతం ఆయన కీలక పాత్ర వహించారు. తిరిగి వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శాప్ ఛైర్మన్ రవి నాయుడుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిమిని రవినాయుడును టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ ఆధ్వర్యంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్ రాయల్ మాట్లాడుతూ విద్యార్థిగా ఎన్నో ఉద్యమాలు చేసి తదనంతరం లోకేష్ బాబు పాదయాత్రలో వెన్నంటి, పార్టీకి అహర్నిశలు కష్టపడిన రవి నాయుడుకు రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవి దక్కడం ఆనందదాయకమన్నారు. ఆయన మరిన్ని ఉన్నత ఉద్యోగాలు అలంకరించాలని ఆశిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు అవిలాల వెంకటేశ్ యాదవ్, విష్ణు, జానకిరామ్ పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్ రవినాయుడుని సన్మానిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

హుస్సేన్ బాబు మృతి మరువలేనిది: సిపిఎం

ప్రజాశక్తి -కోట : మరలపూడి హుస్సేన్ బాబు అనారోగ్య కారణంగా గురువారం సాయంకాలం మరణించారు. సిపిఎంలో 1992 నుండి ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యుడిగా, పార్టీ సిఐటియు కోట మండలాల్లో కార్మికుల కోసం అనేక పోరాటాల్లో పాల్గొంటున్నారు. సిపిఎంలో అనేక కళారూపాన్ని ప్రదర్శించారు. కోట, వాకాడు మండలంలో భూ పోరాటంలో చాలా కీలకంగా వ్యవహరించారు.హుస్సేన్ భాయ్ మరణం పార్టీకి చేరిన లోటు అని స్థానిక మండల సిపిఎం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా గూడూరు సిపిఎం నాయకులు జోగి శివకుమార్ పి శ్రీనివాసులు అంత్యక్రియలలో పాల్గొని సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో కోట సిపిఎం శాఖ కార్యదర్శి రమణయ్య, హరినాథ్, పి మని, బి. రమణయ్య, ఎస్. సురేష్ ముత్యాలయ్య నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.3 లక్షలు విరాళం

ప్రజాశక్తి తిరుపతి సిటీ: కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ఛైర్మన్ పిసి రాయల్ ముఖ్యమంత్రి సహాయ నిధికి మూడు లక్షల రూపాయలు విరాళాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుపతికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రేణిగుంట విమానాశ్రయంలో కలిసిన పిసి రాయల్ ముఖ్యమంత్రి సహాయ నిధికి, అన్నా క్యాంటీన్ నిర్వహణకు తన వంతుగా మూడు లక్షల రూపాయల చెక్కులు అందించాడు. గత రెండు దశాబ్దాలుగా తమ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఈ సందర్భంగా పిసి రాయల్ ముఖ్యమంత్రి తెలిపారు. విరాళాలు అందజేసిన పిసి రాయల్ ను ముఖ్యమంత్రి అభినందించారు.

రేణిగుంట డిఎస్‌పిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట నూతన డిఎస్‌పిగా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. డిఎస్‌పి శ్రీనివాసురావు మాట్లాడుతూ రేణిగుంట సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడుతానని తెలిపారు.

తిరుపతి రూరల్ ఎంపీడీవోగా రామచంద్ర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

తిరుపతి రూరల్ నూతన ఎంపీడీవోగా రామచంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ అందరి సహకారంతో రూరల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేలా కృషి చేస్తానని చెప్పారు.

పవన్‌ను విమర్శించే స్థాయి కరుణాకర్ రెడ్డికి లేదు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

జనసేన అధినేత పవన్ కళ్యాణను విమర్శించే స్థాయి కరుణాకర్ రెడ్డికి లేదని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రాధాన్యతను కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చాటి చెప్పేలా పవన్ కళ్యాణ్ వారాహి బహిరంగ సభ జరిగిందన్నారు. సనాతన ధర్మం పట్ల అంకిత భావంతో ఉన్న గొప్ప వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలో జరిగిన వారాహి బహిరంగ సభ విజయవంతం చేసిన జనసేన, టిడిపి, బిజేపి నాయకులు, కార్యకర్తలకు యువతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు వాడే నెయ్యి తమ పాలనలో కల్తీ కాలేదని ప్రమాణం చేసే ధైర్యం కరుణాకర్ రెడ్డికి లేదన్నారు. పవన్ కళ్యాణ్ ను గాని ఆయన పిల్లల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కరుణాకర్ రెడ్డికి ఆయన కొడుకు అభినయ్ రెడ్డిలకు ఇక రాజకీయ భవిష్యత్ లేదన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీం కోర్ట్ సిట్ ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: GUDUR
H.M.O.P. No. 277 OF 2023

Vayyavuru Sreenivasulu ... **Petitioner**
VS
Vayyavuru Santhi ... **Respondent**

SUMMONS TO RESPONDENT BY WAY OF SUBSTITUTE SERVICE

Vayyavuru Santhi, W/o V.Sreenivasulu, Private Employee, Residing at Teachers colony, Venkatagiri Town& Mandal, Tirupathi District.

Whereas the petitioner has instituted a case against you, you are hereby summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the case or who shall be accompanied by some other person able to answer all such questions on the date 04 -11 -2024 at 10:30 am., in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. Take summons that in default of your appearance on the day above mentioned, the case will be heard and determined in your absence.

Hearing date: 04- 11 -2024

V.CHENCHU KRISHNAIAH,
ADVOCATE, VENKATAGIRI,
CONTACT NO:9985398129.